క్లుప్తంగా

15 లోగా బీమా రెన్యువల్స్ పూర్తిచేయాలి

చీరాల టౌన్: వైఎస్సార్ బీమా రెన్యువల్స్‌ను ఈనెల 15లోపు పూర్తి చేయాలని వైఎస్సార్ కేపీ ఏపీఎం బీ.సుబ్బారావు సూచించారు. ఆదివారం మండలంలోని గ్రామ పంచాయతీల్లోని సచివాలయాల పరిధిలో వలంటీర్లు చేస్తున్న వైఎస్సార్ బీమా రెన్యువల్స్ ప్రక్రియను ఏపీఎం పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పేద కుటుంబాల్లోని కుటుంబ పెద్ద అకాల మరణం చెందితే వారి కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సచివాలయాల పరిధిలోని 50 ఇళ్లకు నియమించిన వలంటీర్లు 50 కుటుంబాల్లోని కుటుంబ పెద్దకు వైఎస్సార్ బీమా పథకాన్ని రెన్యువల్‌ను పూర్తి చేయాలన్నారు. ఏపీవో వెంట పలు పంచాయతీల్లో సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు ఉన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



ఆలయంలో విరిగిపడిన ధ్వజస్తంభం

యద్దనపూడి: మండలంలో శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. వర్షంతో పాటు బలంగా వీచిన గాలులు మూలంగా విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. మండలంలోని పోలూరు గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలోని ధ్వజ స్తంభం విరిగి ఆలయ ప్రహరీపై పడింది. రాత్రి సమయం కావడం, ఆలయంలో భక్తులు లేక పోవడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రజలు భావిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో మండలంలోని అనంతవరం, సూరవారిపల్లె, యనమదల, చింతపల్లిపాడు గ్రామాలలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

కారంచేడు: వేసవి సెలవుల అనంతరం తిరిగి ప్రభుత్వ పాఠశాలలను సోమవారం నుంచి పునఃప్రారంభిస్తున్నామని ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక ఎమ్మార్సీలో మాట్లాడారు. ఎండలను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఉదయం 7:30 గంటల నుంచి 11:30 గంటల వరకు మాత్రమే నిర్వహించాల్సి ఉందన్నారు. అలాగే సోమవారం పాఠశాలల పునఃప్రారంభ సమయంలోనే జగనన్న విద్యా కానుకను ఉచితంగా ప్రతి విద్యార్థికి అందిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగిసిన నాగార్పమ్మ కొలుపులు

బల్లికురవ: మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో కొండవర్ధువారి ఇలవేల్పు నాగార్పమ్మ కొలుపులు ఆదివారం రాత్రితో ముగిశాయి. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలకు సమీపంలో ఉన్న ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఆలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు బుధవారం ప్రారంభమైన ఈ కొలుపులు ఆదివారంతో ముగిశాయి. ముగింపులో భాగంగా ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో ఉన్న కొండవర్దు కుటుంబ సభ్యులంతా తరలిరావటంతో ఐదురోజులుగా గ్రామంలో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

చీరాల: పాతచీరాల ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఒన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు, సిబ్బంది ఆదివారం దాడి చేశారు. అదే సమయంలో జూదరులు పోలీసులను చూసి పరారయ్యారు. ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 17 బైకులు స్వాధీనం చేసుకోగా రూ.500 నగదును సీజ్ చేశారు.

గ్రంథాలయాలు విజ్ఞానాలయాలు

- ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు
- సత్ఫలితాలనిస్తున్న శిబిరాలు
- స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్‌లో ఉచితశిక్షణ



శిక్షణలో భాగంగా కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

చినగంజాం:

పుస్తకం నీస్నేహితుడైతే నువ్వు మంచిదారిలో నడుస్తున్నట్లే. పుస్తకం వల్ల మానసిక వికాసమే కాదు.. విజ్ఞానం, నైపుణ్యాలు అలవరుతాయని మేధావులు, నిపుణులు ఘంటాపథంగా చెప్తున్నారు. ఇప్పుడు ఇంటర్‌నెట్ వచ్చాక పుస్తక పఠనం తగ్గింది కాని ఒకప్పుడు పుస్తకమే అన్నింటికి మూలం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వం వేసవి శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసిన ప్రధాన ఉద్దేశం వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా తమలోని నైపుణ్యాలను, సామర్థ్యాలను మెరుగు పరచుకునే అవకాశాన్ని కలుగజేసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని మండలాల్లో సుమారు 75 శాఖా గ్రంథాలయాల పరిధిలో వేసవిలో సుమారు 3 వేల మందిపైగా విద్యార్థులు వారి విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా శిక్షణ అందుకున్నారు. శిక్షణ శిబిరంలో 6వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు అందరు విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాలు గత నెల 8వ తేదీ నుంచి ఈనెల 11వ తేదీ వరకు నిర్వహించారు. శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులకు చదవడం మా కిష్టం (వీ లవ్ రీడింగ్) అనే కార్యక్రమంలో భాగంగా తెలుగు కథలు చదివించడం, రాయించడం, నీతి కథలు విద్యార్థులకు చెప్పించడం, స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్ శిక్షణ, సృజనాత్మకత కృత్యాలు నేర్పించడం, యోగా, నృత్యం, మ్యూజిక్, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు తదితర అంశాలు నేర్పించడం చేయించారు. విద్యనభ్యసించడంపై ఆసక్తి కలిగించేలా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు.

స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ ఉపయోగపడింది..



గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరంలో నిర్వహించిన స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వీటితో పాటు పలు అంశాల గురించి శిక్షణ శిబిరంలో నేర్చుకున్నాను. పుస్తకం విలువ గురించి శిక్షకులు చెప్పినందుకు థ్యాంక్స్.

– జీ అమృత హర్షిణి, 9వతరగతి

కంప్యూటర్ శిక్షణ బాగుంది..



శిక్షణ శిబిరం ద్వారా కంప్యూటర్ శిక్షణలో మంచి తర్ఫీదు పొందాను. కంప్యూటర్ నేర్చుకోవాలని నాలో ఎంతో కాలంగా ఉన్న కోరిక గ్రంథాలయం ద్వారా నెరవేరింది. థ్యాంక్స్ టు లైబ్రేరియన్.

– కే భావనసాయి, 8వతరగతి

శిక్షణ శిబిరాలతో విద్యార్థులకు మేలు..



వేసవి శిక్షణ శిబిరం ద్వారా విద్యార్థులకు మంచి శిక్షణ అందించగలిగాం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను బోధకులుగా స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్ శిక్షణ, కథలు చెప్పడం, చేతిరాతపై విద్యార్థులకు అవగాహన కల్పించాం.

–ఏఎం లక్ష్మీనరసింహాచార్యులు, లైబ్రేరియన్, చినగంజాం

పుస్తక పఠనంతో మానసిక విజ్ఞానం



కారంచేడులో విజేతలతో జెడ్పీటీసీ రజనీశ్రీనివాసరావు



సంతమాగులూరులో బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ



అద్దంకిలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న లైబ్రేరియన్

- గ్రంథాలయాల్లో ముగిసిన వేసవి శిక్షణ
- విద్యార్థులకు బహుమతులు పంపిణీ

చినగంజాం/మార్టూరు: పుస్తకపఠనంతో మానసిక విజ్ఞానం లభిస్తుందని చినగంజాం లైబ్రేరియన్ లక్ష్మీ నరసింహాచార్యులు అన్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు సర్టిఫికేట్‌లు ప్రదానం చేశారు. గత 40 రోజులుగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్ శిక్షణ, వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణా కార్యక్రమం చివరి రోజున సర్టిఫికెట్లు అందజేసే కార్యక్రమాన్ని లైబ్రేరియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు సుద్దపల్లి నరసింహారావు, మానవహక్కుల పరిరక్షణ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శిఖరం కోటయ్య, యోగా గురువు వలివేటి రామానుజం, రిసోర్స్ పర్సన్లు వై రామాంజనేయులు, పల్లపోలు శ్రీబాబు తదితరులు పాల్గొన్నారు.

■ ఇంకొల్లు మండలంలోని ఇడుపులపాడు గ్రామంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారం ముగిశాయని లైబ్రేరియన్ ఏ శకుంతల తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కథలు చదివించటం, డ్రాయింగ్, నృత్య పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు.

■ వేసవి సెలవుల్లో విద్యార్థులకు నిర్వహించిన విజ్ఞాన శిబిరం తరగతులు ఆదివారం ముగిశాయి. గత 35 రోజులుగా మార్టూరు గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో బాలబాలికలకు కథలు చదివించడం, చెప్పించడం ద్వారా ప్రాచీన కాలంలో ఆచార సంప్రదాయాల గురించి అవగాహన కల్పించారు. క్రీడా, పఠన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పావులూరి జానకి రామారావు, బాలబాలికలు, స్థానికులు పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి)/అద్దంకి రూరల్: సంతమాగులూరు శాఖా గ్రంథాలయంలో 35 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసినట్లు గ్రంథపాలకుడు భాస్కరరెడ్డి చెప్పారు. ముగింపు కార్యక్రమానికి ఎంపీపీ ఎనుబర్ల ఎల్లమంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో ఇప్పటి వరకు పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంతమాగులూరు ఎంపీటీసీ పీ వెంకటరావు, సర్పంచ్ జే నాగరాజు, ఉపాధ్యాయులు పాపయ్య, బీ ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

■ అద్దంకి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రంథపాలకుడు సుగుణరావు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం శిక్షణ శిబిరాలకు ఫ్యాకల్టీగా వ్యవహరించిన ఉపాధ్యాయుడు రాజుబీరును సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, అద్దంకి నాగేశ్వరరావు, పొట్టి సత్యనారాయణ సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



చీరాలలో బహుమతులు అందిస్తున్న అతిథులు

కారంచేడు: గ్రామాల్లోని చిన్నారుల వేసవి కాలం సెలవుల్లో తమ విజ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆమె మండల కేంద్రం కారంచేడు చెరువు కట్ట సమీపంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు ఎం నాగయ్య, వివిద తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

బల్లికురవ: ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా వేసవిలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన తరగతులకు అనూహ్య స్పందన లభించిందని బల్లికురవ లైబ్రేరియన్ ఏ. రమేష్‌బాబు అన్నారు. 35 రోజులుగా జరుగుతున్న తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముగింపులో భాగంగా శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌లను ఆయన అందజేశారు.

చీరాల అర్బన్: విద్యా బాంధాగారాలుగా పేరున్న గ్రంథాలయాలను విద్యార్థులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డు బ్యాంకు మేనేజర్ పి.హరిప్రసాద్ అన్నారు. శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమంలో ఫ్యాకల్టీ డి.హేమంత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



మార్టూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న లైబ్రేరియన్ రామారావు



చినగంజాంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అతిథులు



బల్లికురవలో పరీక్ష ప్యాడ్‌లు అందుకున్న విద్యార్థులు

సందడిగా వాడరేవు సముద్ర తీరం



వాడరేవు తీరంలో సముద్ర స్నానం చేస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: పర్యాటకులతో వాడరేవు సముద్ర తీరం కోలాహలంగా మారింది. ఆదివారంతో వేసవి సెలవులు ముగియడంతోవివిధ గ్రామాల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు ఉదయం నుంచి కార్లు, ద్విచక్ర వాహనాలతో వాడరేవు తీరానికి చేరుకున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో గడిపారు. తీరం ఒడ్డున యువకులు సేదతీరుతూ సముద్రపు మన్నుతో ఆటలాడారు. చీరాల, పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటుగా తెలంగాణా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెదిన పర్యాటకువాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించి తీరంలో సరదాగా గడిపారు.

వైభవంగా విమాన గోపుర ప్రతిష్ట



ప్రతిష్ఠించిన విమాన గోపుర కలశం

అద్దంకి: పట్టణంలోని గాంధీబొమ్మ బజారుకు వెళ్లే రహదారిలోని వీరభద్రస్వామి దేవస్థానంలో ఆదివారం ఆలయ విమాన గోపుర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విమాన గోపుర కలశ ప్రతిష్ఠ, స్వామివారికి విశేష అభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. గోపుర నిర్మాణదాతలు గ్రంధి శ్రీనివాసరావు దంపతులు పమిడిఘంటం చంద్రశేఖర్ అర్చకులు కొల్లిపర సుబ్బారావు, కంఠంరాజు సత్యనారాయణ, యాగ్నేక పూజారి పేర్నమిట్ట ఉదయ్ బృందం విమాన గోపుర కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కోటిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

సమాజసేవలో రోటరీ ముందంజ



ప్రజలకు మజ్జిగ అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతత లభిస్తుందని జాండ్రపేట వాసవీ క్లబ్ అధ్యక్షుడు వీ రామమోహనరావు, సెక్రటరీ సీతారామస్వామి అన్నారు. మండలంలోని జాండ్రపేటలో ఆదివారం వేసవికాలం సందర్భంగా విపరీతంగా ఎండలు కాస్తున్నందున గత 60 రోజులుగా పాదచారులు, ప్రజలకు ఉచితంగా మజ్జిగ, మంచినీటిని అందిస్తున్నారు. ఈసందర్భంగా క్లబ్ ప్రతినిధులు మారుటూరి రాఘవేంద్రరావు, సుధీర్ గుప్తాలు మాట్లాడుతూ నిత్యం వందలాదిమంది రాకపోకలు సాగించే చీరాల–ఒంగోలు ప్రధాన రహదారిలో వేసవిలో ప్రజలకు ఎండల నుంచి ఉపశమనం కలిగించేందుకు గత 60 రోజులుగా ప్రతిరోజు మజ్జిగ, మంచినీటిని అందిస్తున్నామన్నారు. సమాజ సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి మోగనున్న బడిగంట

- వారం రోజులు పాటు ఒంటిపూట బడులు



విద్యాకానుక కిట్లు అందుకుంటున్న హెచ్‌ఎంలు

చీరాల అర్బన్: వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం కానున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో అడ్మిషన్ల కార్యక్రమాన్ని ముమ్మరంగా సాగిస్తున్నారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రచారాలను, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజున విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందించనున్నారు. స్కూల్ బ్యాగు, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, షూస్, డిక్షనరీలతో కూడిన కిట్‌లను అందించేందుకు సిద్ధం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సోమవారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అయితే ఎండ తీవ్రత, వడగాలుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వారం రోజులు పాటు పాఠశాలను ఒక్కపూట నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి11.30 గంటల వరకు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఈ నెల 17వ తేదీ వరకు ఒక్కపూట మాత్రమే తరగతులు నడవనున్నాయి.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

చీరాల అర్బన్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన ఆదివారం చీరాల మండలం తోటవారిపాలెంలో చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. చీరాల రూరల్ మండలం తోటవారిపాలెంలో మోపిదేవి వనజాక్షికి చెందిన పూరిల్లులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ఈ మేరకు బాధితురాలి వద్ద నుంచి అగ్నిమాపక సిబ్బంది వివరాలు నమోదు చేశారు.

ఆదుకుంటున్న ఉద్యాన పంటలు

- గ్రామాల్లో ఆశాజనకంగా పూలు, ఆకుకూరలు, కూరగాయల సాగు
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న చిన్న,సన్నకారు రైతులు



ఆశాజనకంగా పచ్చిమిర్చి

చీరాల టౌన్: వేసవిలో చిన్న, సన్నకార రైతులు ఆకుకూరలు, పూల మొక్కల సాగుతో లాభాలు గడిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని ఇసుక నేలలు ఉన్న సన్నకారు రైతులు పూల తోటలు, ఆకుకూరలు సాగు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. చీరాల రూరల్ మండలంలోని ఇసుక భూములు ఉన్న ఈపూరుపాలెంలోని బోయినవారిపాలెం, సావరపాలెం, బుర్లవారిపాలెం, కావూరివారిపాలెం, పాత చీరాల, చీరాలనగర్ గ్రామ పంచాయతీల రైతులు పెంపకం చేస్తున్నారు. తమకున్న కొద్దిపాటి ఇసుక నేలలో ఆకుకూరలు, పూలమొక్కలు, పూలదండల్లో ఉపయోగించే లైనా ఆకు పంటలను సాగు చేస్తున్నారు. ఆకుకూరలు, పూలమొక్కలు, బెండ, కాకర, పచ్చిమిర్చి, వంకాయలు, టమాటా, దొండకాయలను సాగు చేస్తూ చక్కగా రాణిస్తున్నారు. మండలంలోని బుర్లవారిపాలెం, పాత చీరాల, కొత్తపాలెం గ్రామ పంచాయతీల్లో ఆకుకూరలు, గులాబీలు, మల్లెతోట, వంకాయలు, దొండకాయలు, కాకర, కనకాంబరాలు, నాటు, హైబ్రీడ్ గులాబీ వంటి పూలతోటలను సాగుచేస్తుంటారు. వీటితోపాటు తోటకూర, పెరుగు తోటకూర, మెంతి కూర, పూలదండలలో ఉపయోగించే లైనాకు పంటలను విద్యుత్ మోటార్ల సహాయంతో పండిస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో మల్లెపూల సాగు చేస్తున్న రైతులకు ఎకరానికి రూ.25 వేలు ఖర్చులు పోగా లాభం కూడా రూ. 10 వేల వరకు మిగులుతుందని రైతులు చెప్తున్నారు. వీటిసాగుకు కేవలం మూడున్నర నెలలు మాత్రమే పడుతుండటంతో ఈపంటలను సాగుచేసేందుకు గ్రామాల్లోని చిన్నకారు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వీటి సాగుకు అవసరమైన విత్తనాలను వెదుళ్లపల్లి నుంచి తీసుకువచ్చి రెండు పూటలా విద్యుత్ మోటారు సహాయంతో నీటిని అందించి పంటలను పండిస్తున్నారు. కావూరివారిపాలెంలో పండించిన పూలు, లైనాకును గుంటూరు, విజయవాడ, హైద్రాబాద్ వంటి నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. కూరగాయలను చీరాల కూరగాయల మార్కెట్‌తో పాటుగా ఈపూరుపాలెం, దేవాంగపురి, వేటపాలెం మార్కెట్లకు రైతులు తరలించి అమ్మకాలు చేస్తున్నారు.



పాత చీరాలలో సాగు చేస్తున్న వంకాయ



బుర్లవారిపాలెంలో సాగవుతున్న ఆకుకూరలు

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ట మాసం, ఉత్తరాభాద్ర నక్షత్రం, నవమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం పంచ హారతుల పూజ నిర్వహిస్తారని తెలిపారు.